బయట భర్త కొట్టిన కాలింగ్‌బెల్ చప్పుడు వినిపించింది.

ఆమె వెళ్ళి తలుపు ఎలా తీసిందో ఆమెకే తెలీదు.

"సారీ...డైరెక్టర్స్ మీటింగ్‌లో ఆలస్యమైంది."

ప్రొద్దున్న ఆరింటికి వచ్చి భర్త చెపుతూన్న 'సంజాయిషీ' ఆమెకి వినబడలేదు. అసలామె ఈ లోకంలోనే లేదు.

ఆమె భర్త విష్ణు కేవలం షూస్ విప్పి అవే బట్టలతో పక్కమీద వాలిపోయాడు.

ఇంటి వెనక శబ్దం వినిపిస్తూంది. పనిమనిషి వచ్చినట్టుంది. ఆమె అటువెళ్ళే ప్రయత్నం ఏమీ చేయలేదు. అలాగే కుర్చీలో కూర్చుని కిటికీలోంచి బయటకు చూడసాగింది.

కొత్తగా పెళ్ళయిన వధువు తొలిరాత్రి నిద్ర మేల్కొని కనులు విప్పగానే పక్కనే పురుషుడిని చూసి, తనెక్కడున్నదో తెలియక ఒక్కక్షణం తత్తరపడి, తానిప్పుడు వివాహితనని గుర్తు తెచ్చుకుని.. రాత్రి విశేషాలు చురుక్కుమని గుర్తుకురాగా.. ఆ వధువు మొహం ఎలా ఎర్రబడుతుందో... పైకొస్తున్న సూర్యుడు అలా వున్నాడు. రాత్రంతా ఏమేం ఘనకార్యాలు చేశాడో తెలీదు కానీ మొహం మాత్రం బాగా ఉబ్బింది. చలికి రాత్రంతా ముడుచుకుపోయిన భూదేవిని మంచి చేసుకోవటం కోసం కిరణాలు చేతులుగా సాచి లాలిస్తున్నాడు.

ఆమె కిటికీలోంచి బయటకు చూస్తోంది.

ప్రహసిత్ మాటలే ఇంకా గుర్తొస్తున్నాయ్.

"మీరు ఫోన్ చేస్తారని..నేను రాత్రంతా ఇలాగే...ఈ ఫోన్ ప్రక్కనే కూర్చుని వున్నాను తెలుసా..."

తాను అప్రయత్నంగా అడిగిన ప్రశ్న...."ఎందుకు?"

"మీరెప్పుడయినా ఎవరినయినా ప్రేమించి వుంటే తెలిసేది..రాత్రంతా నిద్ర లేని నా కనురెప్పల మీద ఒట్టు..."

ఏమిటిది? నేనెందుకిలా అయిపోతున్నాను? నాకేమయింది? అనుకుంది ఆమె. కళ్ళ వెంబడి నీళ్ళు మాత్రం ధారాపాతంగా కారిపోతున్నాయి.

అది విషాదమో, ఉద్వేగమో తెలియటంలేదు. ఆమె తేరుకోవటానికి అరగంట పట్టింది. కళ్ళు తుడుచుకుని మంగళసూత్రం కళ్ళ కద్దుకుని కిటికీ దగ్గర్నుంచి లేచి ముందుగదిలోకి వచ్చింది.

రాత్రి సగం వ్రాసిన కాగితాలు బల్లమీద అలాగే వున్నాయి. ఆ రచన పూర్తి చేయటం ప్రారంభించింది. కనీసం రెండు మూడు అధ్యాయాలు పూర్తిచేసి పత్రికకి పంపి, వారికి నచ్చితే మిగతాది పూర్తి చేయాలన్న ఆశ.

మొదటిరచన అవటం వలన ఆమెకి వాక్య నిర్మాణం, శైలి సరిగ్గా కుదరటంలేదు. అయినా భావం 'జల'లాగా ఉబుకుతోంది.

పది సంవత్సరాల ఒంటరితనం వ్యథ రూపంలో కలం నుంచి జాలు వారుతోంది. ఆమె తలెత్తకుండా వ్రాసుకుపోతోంది.

అలా ఎంతసేపు గడిచిందో గుర్తులేదు.

లోపల విష్ణు నిద్ర లేచినట్టున్నాడు. రేడియో పెట్టాడు. వార్తలొస్తున్నాయి.

ఆ అధ్యాయపు చివరివాక్యం వ్రాస్తున్నదల్లా....వార్తల్లో ముఖ్యాంశాలు విని..షాక్ తగిలినట్టు ఆగిపోయింది.

వార్తలు చదువుతూన్న వ్యక్తి చెప్పుకుపోతున్నాడు.

ఆమె అలాగే చిత్తరువులా, కదలకుండా వుండిపోయింది. మొహంలో రక్తం ఇంకిపోయింది. కలాన్ని పట్టుకున్న చేతివేళ్ళు సన్నగా కంపించసాగాయి.

సరిగ్గా కొన్ని గంటల క్రితం ప్రహసిత్ తనతో చెప్పిన మాట..అప్పుడే ప్రెస్‌కి వెళ్ళిపోయింది.

అనౌన్సర్ చెపుతున్నాడు.

"డేవిస్‌కప్‌లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించిన ప్రహసిత్ ఫైనల్‌లో తాను ఆడే  అవకాశం బహుశ లేదని ఈ రోజు ఉదయమే ప్రకటించారు. ఏ నిర్ణయమూ కొద్దిరోజుల్లో తీసుకుంటానని పత్రికా ప్రతినిధులకు చెప్పారు. కారణాలు వెల్లడించటానికి ప్రహసిత్ నిరాకరించారు.....".

ఆమె చేతిలో కలం జారిపోయింది.

ఫోన్‌లో ప్రహసిత్ మాట్లాడిన మాటలు ఇంకా చెవిలో మ్రోగుతూనే వున్నాయి "…. ప్రేమ చిన్నపిల్లల వ్యవహారం కాదనీ, అందులో సీరియస్‌నెస్ వుందనీ నీకు తెలియజెప్పటం కోసం… ఇక డేవిస్‌కప్ ఫైనల్స్ ఆడను… ఒకసారి దూరం నుంచి చూసి ప్రేమలో పడ్డాడు ఇతనిదేం ప్రేమ? అని మీరనుకుంటె…. ఇంతకాలం నా ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమించిన టెన్నిస్ నుంచి శాశ్వతంగా తప్పుకుంటాను…."

ఆమె స్తబ్దుగా కూర్చుండిపోయింది.

సంవత్సరాల తరబడి యుద్ధంచేసి ఒక సామ్రాజ్యాన్ని గెలవొచ్చు. పోరాటం సాగించి మహారాజ్యాన్ని స్థాపించవచ్చు. పట్టుదల పెట్టుబడిగా పెట్టి పర్వతారోహణ చేయవచ్చు. విస్ఫోటనం కావించి పర్వతాన్ని నేలమట్టం చేయవచ్చు. మహాసముద్రాల ఆవలితీరం చేరుకోవచ్చు. ఆనకట్టతో నదీ ప్రవాహాన్ని నిర్దేశించవచ్చు. మనిషి దేన్నైనా సాధించగలడు. కానీ బలవంతంగా ఒక పువ్వుని వికసింపజేయలేడు.

అది కేవలం ప్రకృతికే సాధ్యం.

## రెండో అధ్యాయం

తనని ఉద్యోగంలోంచి తొలగిస్తున్నట్టు వున్న ఉత్తర్వుని చూడగానే మధూహాకి భూమి గిర్రున తిరగలేదు. ఆకాశం విరిగి మీద పడలేదు.

మూడే వాక్యాలున్నాయి "...మీ పని సంతృప్తికరంగా లేదు. జీతం అడ్వాన్సుగా ఇచ్చి. మీ సర్వీసు మాకిక అవసరం లేదని ఇందుమూలంగా తెలియజేస్తున్నాం".

అది కాదు అసలు కారణం..... ఆమెకు తెలుసు. పత్రిక నష్టాల్లో నడుస్తోంది. వీలైనంతమందిని తొలగించాలని యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. అదీ కారణం.

కళ్ళలో తిరుగుతున్న నీరు చెంపల మీదకు జారకుండా గట్టిగా రెప్పలు మూసుకుంది. ఒక స్టిల్ ఫోటోగ్రాఫ్‌లా తన కుటుంబ చిత్రం కళ్ళముందు కదలాడింది. పత్రికాఫీసులో ఇస్తున్న ఈ ఎనిమిదొందలే తమ జీవనాధారం... ఇప్పుడిది పోతే....

ఆ తరువాత ఆమె ఆలోచించలేకపోయింది. అనారోగ్యం తల్లి. చదువుకుంటున్న చెల్లి గుర్తొచ్చారు. "...ఇప్పుడేం చెయ్యాలి? సంసారాన్నెలా గడపాలి?" అన్న ప్రశ్నలే కళ్ళముందు భయంకరంగా నృత్యం చేస్తున్నాయి.

ఆమె ఉత్తరం పట్టుకుని ఎడిటర్ రూమ్ కొచ్చింది. ఎడిటర్ శాస్త్రి వృద్ధుడు. ఇంకో ఆర్నెల్లలో రిటైర్ అవబోతున్నాడు. ఆ ఉత్తరం చూసి చాలా బాధపడ్డాడు. 'ఇదేమిటమ్మా అనుకోకుండా ఇలా జరిగింది' అన్నాడు.

"సర్క్యులేషన్ లేదు కాబట్టి నిన్ను తీసేస్తున్నాం అని వుంటే నేను కాస్త సంతోషించేదాన్ని సార్. నా పని సంతృప్తికరంగా లేదన్నారు. అదీ బాధ...."

శాస్త్రి సమాధానం చెప్పటానికి ఏమీ లేనట్టు కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు. ఆయన్ని మరింత ఇబ్బంది పెట్టటం మధూహాకి ఇష్టం లేకపోయింది. నమస్కరిస్తూ "వెళ్ళొస్తాను సార్. టేబుల్ సర్దుకుని నా వస్తువులు ఏమైనా వుంటే తీసుకువెళ్తాను. అప్పుడే ఆరయింది" అంది.

ఎడిటర్ ఆమెవైపు చూడకుండానే "మంచిదమ్మా" అన్నాడు. ఆమె వెళ్ళిపోవటం అడుగుల చప్పుడు ద్వారా తెలుస్తోంది. ఆయన మనసు వికలమైంది. మధూహ చాలా తెలివైన అమ్మాయి. అంతేకాదు. చేస్తున్న పనిపట్ల అంకితభావం వున్న అమ్మాయి . అలాంటివాళ్ళు ఈ రోజుల్లో చాలా తక్కువమంది వుంటారు. ఆమెని కోల్పోవటం పత్రికకి ఎలావున్నా, తనకి మాత్రం నష్టం!!

యాజమాన్యం కూడా ఏమీ చేయలేదు. ఇప్పుడున్న సర్క్యులేషన్ దృష్ట్యా తన ఉద్యోగమే సందిగ్దంలో పడేలా వుంది. పత్రిక మూసేసినా ఆశ్చర్యపోనవసరం లేదు.

స్వింగ్‌డోర్ చప్పుడయితే తలెత్తి చూశాడు. మధూహ లోపలికి వచ్చింది. ఆమె చేతిలో కాగితాలున్నాయి.

"కొన్ని రోజుల క్రితం ఈ స్క్రిప్టు పోస్టులో వచ్చింది సార్. రచయిత్రి ఎవరో లక్ష్మి అట. ఇది మన పత్రికకు సరిపోదని, నా లెవల్లోనే తీసి పక్కన పెట్టేశాను. కానీ రచన చాలా బావుంది సర్".

"నన్నొకసారి చదవనీ...."

ఆమె తటపటాయించి "చదివితే మీరు వేయరు" అంది.

అతడు విపరీతమైన ఆశ్చర్యంతో ఆమె వంక చూశాడు.

"అవునండీ. ఇందులో కథ లేదు. కామెడీ...ట్విస్టులు.. సెక్సు ...హింస,...ఏమీ లేవు. ఒక స్త్రీ మనసుంది. అంతే"

ఎడిటర్ పేపర్ల వ్రాతప్రతి తీసుకుని పక్కన పెట్టుకున్నాడు. ఇలాటి మాటల మీద ఆయన ఆధారపడడని మధూహకి తెలుసు. అయినా అంది... "సర్"

ఆయన తలెత్తాడు.

"ఇన్నాళ్ళు పని చేసినా నేను మిమ్మల్ని ఏమీ అడగలేదు. ఇలా నేను మీకు చెప్పటం కూడా సాహసమే..." అని ఆగి" "...వీలైతే ఆ రచన వేయండి సార్" అంది.

"ఇది వ్రాసిన వాళ్ళు నీకు తెలుసా?"

"లేదండీ...పోస్టులో వచ్చింది. వ్రాత ఎక్కడో చూసినట్టు వుంది కానీ, ఎవరో తెలియటం లేదు. అయినా నేను దీన్ని ప్రచురించమంటోంది రచయిత్రి ఎవరో తెలిసి కాదు...".

"ఛా....ఛా...నా ఉద్దేశం అది కాదు..." అని ఆగి, "నేను చదువుతాన్లే అమ్మా" అన్నాడు.

ఆమె నమస్కరించి వెళ్ళొస్తానని చెప్పి బయటకు నడిచింది.

ఎడిటర్ శాస్త్రి ఆ రోజు పత్రికలో వెళ్ళవలసిన అడ్వర్టయిజ్ మెంట్స్ చూశాడు. రకరకాల ప్రకటనలు --

"మైండ్ హిప్నో మాగ్నో థెరపీ"

మీరు పరీక్షల్లో మార్కులు సరిగ్గా రావటం లేదా! నిద్రలేమితో బాధపడుతున్నారా? కాంప్లెక్సులు మిమ్మల్ని సతాయిస్తున్నాయా? మీతో అంతర్గతమైన శక్తి బయటపడటంలేదని భావిస్తున్నారా? నత్తి, నరాల బలహీనత జ్ఞాపకశక్తిని పెంచి, మీలో వ్యక్తిత్వాన్ని నింపుతుంది. కాన్సర్ నుంచి కాలేయవ్యాధుల వరకూ తగ్గిస్తుంది... మైండ్ హిప్నో మాగ్నో థెరపీ... స్టేజి ఫియర్ పోగొట్టుకోవాలనుకున్నా, నలుగురితో మాట్లాడటానికి భయపడుతున్నా, మీ శ్రీమతి మీకు పూర్తి సుఖం ఇవ్వటానికి, మీ శ్రీ వారికి పరస్త్రీ సంబంధాలు తగ్గించటానికి మమ్మల్ని సంప్రదించండి. మా థెరపీ మీ ఏకాగ్రత పెంచటానికి తోడ్పడుతుంది. మీ శత్రువుల్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తుంది. అంతే కాదు. వ్యాపారంలో నష్టాల్ని తగ్గిస్తుంది. మీరు ప్రేమించిన అమ్మాయితో ధైర్యంగా మాట్లాడే శక్తిని అందజేస్తుంది. మీ గతం బాధాకరమైనదయితే దాన్ని మర్చిపోయేలా చేస్తుంది. మీరు గతంలో ఏదైనా మర్చిపోతే, దాన్ని గుర్తు తెచ్చుకునేలా చేస్తుంది. వెంటనే సంప్రదించండి.

డాక్టర్ విశాల్స్

హిప్నో థెరపీ

ఎడిటర్ శాస్త్రి గాఢంగా నిశ్వసించి అడ్వర్టయిజ్‌మెంట్ వింగ్‌కి ఫోన్ చేసి "ఈ మైండ్ హిప్నో మాగ్నో థెరపీ క్లినిక్ ఏమిటి?" అన్నాడు.

"ఏమైంది?"

"వీళ్ళు ప్రపంచంలో చేయలేనిదంటూ లేదా?"

"డబ్బిచ్చారు, మనం వేస్తాం. అంత వరకే."

"ఇందులో తప్పులున్నాయి."

"ఆ క్లినిక్ తాలూకు మనిషి ఇక్కడే వున్నాడు. ఇంకో ప్రకటన తీసుకొచ్చాడు. పంపిస్తానతన్ని. మాట్లాడండి."

రెండు నిముషాల తరువాత ఒక బక్క పలచటి వ్యక్తి లోపలికి వచ్చాడు. కాస్త మాసిన 'టీ షర్టు' వేసుకున్నాడు.

అతడిని చూడగానే అంత మంచి అభిప్రాయం కలుగలేదు శాస్త్రికి.

"నా పేరు రాజు. ఏవో తప్పులున్నాయన్నార్ట".

శాస్త్రి కాగితాన్ని ముందుకు తోస్తూ "..నత్తి, నరాల బలహీనత, జ్ఞాపకశక్తిని పెంచి...అని వ్రాశారు. నత్తినీ, నరాల బలహీనతని కూడా పెంచుతుందా మీ క్లినిక్?" అని అడిగాడు.

రాజు నాలిక్కర్చుకుని, "తప్పయిపోయింది. మీరే కాస్త మార్చండి" అన్నాడు. శాస్త్రి దాన్ని మారుస్తూ "ఎలా వుంది బిజినెస్?" అని అడిగాడు.

“ఇప్పుడు ప్రారంభం అయింది కదండీ. ఇంకా చెప్పలేం” అంటూ  రెండో ప్రకటన ఇచ్చి “ఇది కూడా చూడండి” అన్నాడు వెళ్ళటానికి ఉద్యుక్తుడవుతూ.

శాస్త్రి దాన్ని అందుకుంటూ “నిన్న రాత్రి మా ఇంట్లో ఒక దొంగ ప్రవేశించాడు. చీకట్లో అతన్ని గుర్తు పట్టలేకపోయాను. నేను అరిచి కేక పెట్టేసరికి పారిపోయాడనుకో. వెళ్తూ వెళ్తూ టేబిల్ మీదున్న వాచీ తీసుకుపోయాడు” అంటూ ఇంకా చెప్పబోతూ వుండగా ...... “మీరు మా క్లినిక్‌కి రండి. అతడిని పట్టుకోవచ్చు” అన్నాడు రాజు.

శాస్త్రి అదిరిపడి “ఎలా?” అన్నాడు.

“నిద్రలో కూడా మీ కనుపాపల మీద ఆ దొంగ రూపం ముద్రింపబడి వుంటుంది. మీ మైండ్‌ని మేం హిప్నటైజ్ చేస్తాం. అది  మీలో శక్తిని బయటకు తీసుకువస్తుంది. ఆ దొంగని చూడగానే మీరు గుర్తు పట్టగలరు.. దాన్నే ఏజ్... రిగ్రెషన్ అంటారు”.

రాబోయే అతి సమీపకాలంలో మైండ్ హిప్నో మాగ్నో క్లినిక్ లక్షలమంది జనాల్ని ఆకర్షించబోతోందని శాస్త్రికి అర్థమైంది.

రాజు వెళ్ళిపోయాక ‘చేతి వాచిని’ సర్దుకుంటూ తిరిగి తన పనిలో మునిగిపోయాడు.

పార్కులో అరగంట నుంచీ ఎదురుచూస్తోంది మధూహ.

ఆరున్నరకి వచ్చాడు అతడు.  అరగంట అలస్యంగా.

“సారీ”.